క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏపీఎన్ఎస్ ప్రభాకరరావు గురువారం తెలిపారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలన్నారు.

పీ-4 పథకంపై అవగాహన అవసరం



శిక్షణ తరగతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 పథకంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం గ్రామ సచివాలయ సిబ్బందికి ఈ పథకంపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పీ-4 పథకాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. అనంతరం పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు.

మన డబ్బులు - మన లెక్కలపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం, ఈఎంటీలు

సామర్లకోట: మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులపై అవగాహన కలిగే విధంగా మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం జగదీశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని పండ్రవాడ, బోయనపూడి, మాధవపట్నం, వేట్లపాలెం గ్రామాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. మహిళల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న యాప్ ఆధారంగా మన డబ్బులు- మన లెక్కలు పూర్తి వివరాలతో తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులను కొందరు మోసం చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో సంఘం నుంచి తీసే ప్రతి పైసా గురించి సభ్యులందరికీ సమాచారం వస్తుందన్నారు. వెలుగు ఐబీ డీపీఎం అశోక్‌భరత్, ఐబీ ఏపీఎం ఇందిరా, మన డబ్బులు- మన లెక్కలు ఈఎంటీలు కళావతి కుసుమ, సీసీ చైతన్య, రమేష్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పసర పండగ



వాకతిప్ప శెట్టిబలిజపేటలో రావిచెట్టు వద్ద భక్తుల కోలాహలం

కొత్తపల్లి: వాకతిప్పలోని శెట్టిబలిజపేటలో గురువారం పసర పండగను ఘనంగా నిర్వహించారు. పూర్వ కాలం నుంచి పెద్దాపురం మరిడమ్మవారు ఈ పేటలో రావిచెట్టు వద్ద కొలువై ఉన్నారని, పొలాలు వచ్చదనంతో ఉన్నప్పుడు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో ఈ పండగ నిర్వహించడం ఆచారంగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో పిల్లలు, పెద్దలు, ప్రజలు సంతోషంగా ఉండాలని ఈ పండగ జరుపుతున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రకృతి సాగు పరిశీలన



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న సభ్యులు

కొత్తపల్లి: గోర్స గ్రామంలో చెందిన గంధం శ్రీనివాస్ చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని గురువారం అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ కోనసీన జిల్లాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాల సభ్యులు పరిశీలించారు. శ్రీనివాస్ 20 సెంట్ల పొలంలో అన్ని రకాల కూరగాయలను ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పండిస్తున్నారు. దీనిని వారు పరిశీలించారు. బీఆర్‌సీ యజమానులు బుజ్జిబాబు, గణేష్, నాగలక్ష్మి, శివచక్రం తదితరులు పాల్గొన్నారు.

నాడు కళ.. నేడు వెలవెల

- సాంకేతిక శిక్షణకు మంగళం
- తుప్పలతో నిండిన టీటీడీసీ ప్రాంగణం



టీటీడీసీలో ఖాళీగా ఉన్న కుట్టు మెషీన్లు



కేంద్రం ప్రాంగణంలో పెరిగిపోయిన తుప్పలు

సామర్లకోట: ఎంతో మంది యువతకు శిక్షణ ఇచ్చిన కేంద్రం అది.. అలాగే మహిళా సంఘాల సమావేశాలతో కళకళలాడేది.. అలాంటి ట్రైనింగ్ సెంటర్ ఇప్పుడు ఎందుకూ కొనగాకుండా మారింది.. సామర్లకోటలోని శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ) మూతపడే పరిస్థితికి చేరింది. ఇక్కడ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులకు శిక్షణతో కళకళలాడేది. నేడు ఆ సందడి కనుమరుగైంది. ఇప్పటి వరకూ శిక్షణ పొందిన వారికి రాత పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకోవాలనే పరిస్థితికి తీసుకొచ్చారు. 1999లో అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఈ సాంకేతిక అభివృద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. దీనిని 2000లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రారంభించారు. 2004లో అప్పటి ఎమ్మెల్యే తోట గోపాలకృష్ణ ఇక్కడ మహిళలకు రూ.30 లక్షలతో ఫ్యాషన్ టెక్నాలజీ ప్రాజెక్టును ప్రారంభించారు. అప్పటి రాజ్యసభ సభ్యురాలు వంగా గీత ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అయితే ప్రాజెక్టు అవినీతికి నిలయంగా మారడంతో సుమారు 15 ఏళ్ల క్రితం ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్‌ను మూసివేశారు. తర్వాత ఈ భవనాన్ని జిల్లా మహిళా సమాఖ్య కేంద్రంగా మార్పు చేశారు. ఉమ్మడి జిల్లాలో మత్స్యకార మహిళా సమాఖ్యలతో కలసి 63 మండలాలతో ప్రతి నెలా జిల్లా మహిళా సమాఖ్య సమావేశాలు జరిగేవి. జిల్లా విడిపోయిన తరువాత కాకినాడ జిల్లాలోని 20 మండలాల మహిళా సమాఖ్యలతో సమావేశాలు నిర్వహించేవారు. ఆరు నెలలుగా ఈ సమావేశాలను నిలిపివేసి కాకినాడలోనే జరుపుతుండడంతో ఇక్కడ సందడి కరవైంది. అందుబాటులో ఉండే శిక్షణ కేంద్రం నుంచి కాకినాడకు జిల్లా సమాఖ్య సమావేశాలు మార్పు చేయడంతో సర్వత్రా విమర్శలకు దారితీస్తుంది. దీంతో ఇక్కడకు వచ్చే అధికారులు లేక కేంద్రం తుప్పలతో దర్శనమిస్తోంది.

ఆగిన సాంకేతిక శిక్షణ

ఈ శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులపై మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి తర్వాత ఉపాధి అవకాశాలను డీఆర్‌డీఏ ద్వారా కల్పించేవారు. అదే విధంగా మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చేవారు. వాటిని కూడా నిలిపివేశారు. ఇప్పటి వరకూ శిక్షణ పొందిన వారికి రాత పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చి పంపించేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ పూర్తి కావడంతో ప్రస్తుతం శిక్షణ నిలిచిపోయినట్లు డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు 'సాక్షి'కి తెలిపారు.



సామర్లకోటలో శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రం

పూర్వ వైభవం తేవాలి



స్థానిక టీటీడీసీలో ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌కు పూర్వ వైభవం తేవాలి. ఈ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సుపై శిక్షణ ఇవ్వడం వల్ల అనేక మంది నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో స్వయంగా కంప్యూటర్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఏర్పడేది. అదేవిధంగా ప్రైవేట్ కంపెనీల్లో ఇంటర్వ్యూలను ఏవిధంగా ఎదుర్కోవాలో తెలిసేది.

–రేలంగి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, వీకే రాయపురం

పెరిగిపోయిన తుప్పలు



శిక్షణ సాంకేతిక అభివృద్ధి కేంద్రంలో తుప్పలు పెరిగిపోయాయి. అధికారులు ఎవరూ ఈ కేంద్రానికి రాకపోవడంతో పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. స్థానిక ఎమ్మెల్యే ఈ శిక్షణ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి నెలా జిల్లా మహిళా సమాఖ్య సమావేశం సామర్లకోట టీటీడీసీలో జరిగే విధంగా చూడాలి. నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణలు ప్రారంభించాలి.

–నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

నేడు వైద్య కళాశాల ఎదుట నిరసన



కరణం భాను

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి కరణం భాను తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందాలనే లక్ష్యంతో వైద్య కళాశాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుమతి ఇస్తే, వాటిని పారిశ్రామిక వేత్తలకు అప్పగించడానికి సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని యువతతో శుక్రవారం అమలాపురం వైద్య కళాశాల వద్ద నిరసన తెలుపుతామన్నారు. గత ప్రభుత్వంలో ఐదు వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారని, మిగిలిన కళాశాలలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

నేడు, రేపు లేఖర్ల పెన్‌డౌన్

సామర్లకోట: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానం వల్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్ చేస్తున్నట్లు దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్ల సంఘ అధ్యక్షుడు సీతాపతిరావు తెలిపారు. ఈ విధానంతో రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీలు బహిర్గతం చేయడానికి ప్రజలు సంకోచిస్తున్నారని అన్నారు. ఆటో మ్యూటేషన్ సిస్టం మంచిదే కాని డిపార్ట్‌మెంట్‌లో సమన్వయ లోపం వల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసనలు



పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద..

పెద్దాపురం: వీఆర్‌ఏల సమస్యలను కూటమి ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని వీఆర్‌ఏల సంఘ జిల్లా నాయకులు నిడమర్తి సురేష్, గెద్దం బాబూజీ అన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్దాపురం వీఆర్‌ఏ సంఘం నాయకులు దువ్వాపు వీరబాబు, సుందరపల్లి రామలింగేశ్వరరావు, చింతపల్లి సాయిభువన్, నూకతట్టు వెంకటరమణల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భగా సురేష్, బాబూజీ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా శాంతియుత ధర్నాలు చేపట్టామన్నారు. 20న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం, 21న జిల్లా కలెక్టరేట్ వద్ద శాంతియుత ధర్నా నిర్వహిస్తామన్నారు. వీఆర్‌ఏలు హాజరై విజయవంతం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో గంపల వీరబాబు, గొర్ల సత్యవేణి, షేక్ బీబీ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని మండల వీఆర్‌ఏల అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు నాలుగు రోజుల పాటు నిరసనలో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులకు వీఆర్వోలు, డ్రైవర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లుగా పదోన్నతులు కల్పించాలని, అలాగే నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలి డిమాండ్ చేశారు. కార్యదర్శి అప్పలస్వామి, కోశాధికారి అప్పారావు, ఎం.రాంబాబు, పి.సత్తిబాబు, యు.సీత, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: గ్రామ రెవెన్యూ సహాయకులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్‌ఏల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దశల వారీగా ఆందోళనను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన పెంచాలి



సామర్లకోట మున్సిపల్ హైస్కూల్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం సూర్యఘర్‌పై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. గురువారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంగీకార్ 2025లో భాగంగా సోలార్ విద్యుత్తుకు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను హెచ్ఎం కె.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కమిషనర్ బహుమతులు అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ కె.కన్నబాబు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవహర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి, యు.నాగమణి, కాంతిప్రియ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థులు చేతుల శుభ్రతపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య సూచించారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా సత్య దత్త వ్రతాలు



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో సత్య దత్త వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక దత్త క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో గురువారం సత్య దత్త వ్రతాలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల నడుమ సత్య దత్త వ్రతం నిర్వహించగా, పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ గోశాలలో గోపూజ నిర్వహించారు. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు జరిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక గాంధీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అసంక్రమిత వ్యాధుల నిర్ధారణకు 18 నుంచి 30 ఏళ్ల మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామని వైద్యులు పూజ తెలిపారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్లకు వైద్యం అందిస్తామన్నారు. వైద్యులు అశ్విని, కేవీఆర్‌పీ ప్రభ, రమశ్రీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కొత్తపల్లి: ఆరోగ్యం ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కొత్తపల్లి, కొమరగిరి పీహెచ్‌సీల వైద్యాధికారులు సుష్మ, రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పాడ- 4, కొండెవరం- 1 సచివాలయాల వద్ద గురువారం స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ కౌమార బాలికలు, 20 ఏళ్లు దాటిన మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నామన్నారు.

22 నుంచి సంగీత, నృత్య ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని సూర్యకళా మందిరంలో ఈ నెల 22 నుంచి 25 వరకూ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు నిర్వహిస్తారని సరస్వతీ గానసభ గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. 22న సాయంత్రం వయోలిన్ కచేరి, 23, 24న గాత్రకచేరి, 25న కూచిపూడి నృత్యం ఉంటుందన్నారు.

నాలుగు బార్లకు లైసెన్సులు

కాకినాడ క్రైం: జిల్లా పరిధిలో నాలుగు బార్లకు అనుమతులు మంజూరయ్యాయి. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పర్యవేక్షణలో డీఆర్‌ఓ వెంకట్రావు లాటరీ ద్వారా గురువారం వీటిని ఎంపిక చేశారు. తాజా కేటాయింపులలో భాగంగా జనరల్ కేటగిరీలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు, రిజర్వుడ్ కేటగిరీలో గొల్లప్రోలు నగర పంచాయతీలో ఒక బారుకు అనుమతులు లభించాయి.

నూతన అంశాలపై పట్టు సాధించాలి

బాలాజీచెరువు: సాంకేతిక విద్యార్థులు నూతన అంశాలపై పట్టు సాధించాలని జేఎన్‌టీయూకే డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ అన్నారు. స్కూల్ ఆఫ్ ఏవియానిక్స్, ఐఎస్‌టీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ డిజైన్, అసెంబ్లీ అండ్ పేలెయిట్ ఆపరేషన్‌పై వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేస్తామన్నారు. జేఎన్‌టీయూకే వర్సిటీ ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపయోగపడే టూ వీలర్ అంబులెన్స్, అలాగే ఆవిరి ద్వారా మంచినీటి తయారీ వంటి ప్రాజెక్టులు రూపొందించామన్నారు. డాక్టర్ దోలాసందీప్ హాజరై భవిష్యత్‌లో రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, స్మార్ట్ సిటీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగంపై వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ బీటీ కృష్ణ, ప్రొఫెసర్ పద్మప్రియ పాల్గొన్నారు.

సర్పంచులకు ముగిసిన శిక్షణ

కాకినాడ రూరల్: జిల్లాలోని పలు మండలాలకు చెందిన సర్పంచులకు కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. రెండేసి రోజుల చొప్పున మొత్తం నాలుగు రోజుల పాటు ఆర్‌జీఎస్‌ఏ వార్షిక ప్రణాళిక 2025-26కు గాను గ్రామాల్లో 29 అంశాలపై సర్పంచులకు శిక్షణ అందించారు. కాకినాడ రూరల్, కరప, పెదపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, కాజులూరు, యు.కొత్తపల్లి మండలాల సర్పంచులు హాజరయ్యారు. పదవీ కాలం ముగింపు దశకు చేరుకోవడంతో చాలా మంది సర్పంచులు రాలేదు. పలు అంశాలపై కాకినాడ రూరల్ ఎంపీడీఓ సతీష్ అవగాహన కల్పించారు.

ఆటకెక్కించారు!

- జిల్లా క్రీడా మైదానంలో వసతుల కరువు
- ఆరుబయట భోజనాలతో ఇబ్బంది
- తొమ్మిదేళ్లయినా పూర్తికాని డైనింగ్ హాల్, డార్మెటరీ నిర్మాణం



డీఎస్‌ఏలో పూర్తికాని డార్మెటరీ భవన సముదాయం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడా ఎంపికలకు కేంద్రం అది.. అయినా కనీస సౌకర్యాలు కానరాకుంది.. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానం (డీఎస్‌ఏ)లో పరిస్థితి ఇది.. రాష్ట్రంలోనే పెద్ద క్రీడా మైదానంగా పేరొందిన ఇక్కడ ఎండైనా, వానైనా క్రీడాకారులు ఆరుబయటే భోజనాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కడుపు నింపుకోవడం కోసం విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శాప్ అంటే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ ఇది. శాప్ అధికారుల నిర్లక్ష్యంతో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రూ.రెండు కోట్లతో చేపట్టిన డార్మెటరీ, డైనింగ్ హాల్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇది ప్రారంభించి తొమ్మిదేళ్లు అవుతున్నా పూర్తికాని పరిస్థితి. ఆ వివరాల్లోకి వెళితే.. పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 షెడ్యూల్ ఈ నెల 11 నుంచి 19 వరకూ జిల్లా స్థాయిలో వివిధ క్రీడల్లో డీఎస్‌ఏలో నిర్వహిస్తున్నారు. ఈ ఎంపికలకు రోజూ వందల సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. వీరికి భోజనాలు వడ్డించేందుకు డైనింగ్ హాల్ లేక ఎంపికలు నిర్వహిస్తున్న ప్రతిసారీ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా, వానైనా భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రీడా మైదానంలో 2016లో అకాడమీ డార్మెటరీ, డైనింగ్, కిచెన్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి శాప్ ప్రిన్సిపల్, సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, శాప్ ఎండీ బంగార్రాజు రూ.రెండు కోట్లతో డార్మెటరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీతో బిల్డింగ్ ప్లాన్‌ను తయారు చేయించారు. నిర్మించే భవనంలో కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ గదులు, బాత్‌రూమ్‌లు పూర్తి సదుపాయాలతో నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఆర్‌ఈఎస్ ద్వారా భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే శాప్ విడుదల చేసిన నిధులకు కేవలం భవనంలో స్కెలిటన్ మాత్రమే నిర్మించారు. ఎలక్ట్రికల్ పనులు, బాత్‌రూమ్స్, తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అసలు రూ.రెండు కోట్లకు నాలుగు అంతస్తుల నిర్మాణానికి ప్లాన్ వేశారు. ఇప్పుడు గ్రౌండ్ ఫ్లోర్ కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఈ భవనం పూర్తి కావాలంటే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు అవుతుందని డీఎస్‌ఏ అధికారులు చెబుతున్నారు.

ఇబ్బంది తప్పడం లేదు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లా విడిపోయిన తరువాత డీఎస్‌ఏ తప్ప క్రీడలపరంగా మౌళిక వసతులు కలిగిన సముదాయం ఇంకొకటి లేదు. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేటప్పుడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. పోటీలు నిర్వహించే సమయంలో వర్షం వస్తే క్రీడాకారులు ఆరుబయటే భోజనం చేయాల్సిన పరిస్థితి. ఇటీవల శాప్‌కు క్యూఆర్ కోడ్ ద్వారా రూ.లక్షలు నెలకు జిల్లాల నుంచి జమ అవుతున్నా భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు స్థానిక దాతల సహకారంతో చూసుకోవాలని శాప్ అధికారులు చెప్పడంపై క్రీడాసంఘాల ప్రతినిధులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సరైన సదుపాయాలు లేక..



డీఎస్‌ఏలో క్రీడలపరంగా సదుపాయాలు ఉన్నాయి. కానీ భోజనాలకు సరైన సౌకర్యం లేక జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు, ఎంపికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మరింది. భోజనాల గదులు అందుబాటులోకి వస్తే ధైర్యంగా రాష్ట్ర, జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలను నిర్వహించవచ్చు.

–శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

పూర్తయితే ఊరట



డీఎస్‌ఏలో డైనింగ్ రూమ్ లేక విద్యార్థులకు ఆరు బయట వర్షం, ఎండలోనే భోజనాలు పెట్టాల్సి వస్తుంది. వచ్చే నెలలో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. అప్పటికైనా డైనింగ్ రూమ్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఒకింత ఊరటగా ఉంటుంది.

–సుధారాణి, ఎస్‌జీఎఫ్‌ఐ మహిళా కార్యదర్శి



వర్షంలోనే ఆరుబయట భోజనాలు చేస్తున్న క్రీడాకారులు